ఇంటి వద్దకే పింఛన్లు

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం ప్రతినెల 1వ తేదీన ఉదయం ఇంటి వద్దకే పింఛన్లను అందిస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని ఖాదర్‌బాద్ గ్రామంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి 26వ వార్డు కౌన్సిలర్ రాచమల్లు రమాదేవి శుక్రవారం గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేయలేదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో పింఛన్లు తీసుకోవాలంటే వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. జగన్ పాలనకు, చంద్రబాబు పాలనకు ఈ ఒక్క తేడాను గమనిస్తే పరిపాలన ఎలా ఉందో అర్థమవుతుందన్నారు. డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని, రోడ్డు నిర్మించాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గురుస్వామి ఇంటి వద్ద ఖాదర్‌బాద్‌కు చెందిన డ్వాక్రా మహిళలు ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ శేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ గురుస్వామి, సోములవారిపల్లె సర్పంచ్ ప్రశాంతి, ఎంపీటీసీలు బషీరున్, బాలాజీ, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, మండల కన్వీనర్ ఓబుళరెడ్డి, టీటీడీ పాలకమండలి సభ్యుడు టంగుటూరు మారుతిప్రసాద్, పేరం బ్రహ్మానందరెడ్డి, పోరెడ్డి నరసింహారెడ్డి, రాజుపాళెం మండల కన్వీనర్ గుద్దేటి రాజాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీగా కత్తి నరసింహారెడ్డిని గెలిపించండి



కత్తి నరసింహారెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరుతున్న నాయకులు

ప్రొద్దుటూరు : ఎస్‌టీయూ నేత కత్తి నరసింహారెడ్డిని మరోమారు ఎమ్మెల్సీగా గెలిపించాలని ఎస్‌టీయూ నాయకుడు వక్కల వెంకటసుబ్బయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు కోరారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, డీఏడబ్ల్యూ మహిళా కళాశాలల్లో వారు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. శాసనమండలిలో ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలపై గళమెత్తిన కత్తి నరసింహారెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. ఎస్టీయూ, ఏఐవైఎఫ్ నాయకులు సురేష్, అన్సారీ పాల్గొన్నారు.

అన్నదానం గొప్ప కార్యం

ప్రొద్దుటూరు : అన్నదానం చేయడం గొప్ప కార్యమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. పోరెడ్డి సుజాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి శుక్రవారం మధ్యాహ్నం స్థానిక పాతబస్టాండ్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే రాచమల్లు హాజరై అన్నదానం చేశారు. పోరెడ్డి నరసింహారెడ్డితోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రారంభమైన శనగల కొనుగోలు



శనగల కొనుగోలును ప్రారంభిస్తున్న తహసీల్దార్ రమాకుమారి

దువ్వూరు : మండల పరిధిలోని పెద్దజొన్నవరం ఆర్‌బీకేలో శుక్రవారం శనగల కొనుగోలును తహసీల్దార్ రమాకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు శనగలు క్వింటాల్ ధర రూ.5,335లకు కొనుగోలు చేస్తామని తెలిపారు. పెద్ద జొన్నవరం, జిల్లెల్ల, మాచనపల్లె గ్రామాలకు చెందిన రైతులు శనగ పంటను ఈ ఆర్‌బీకేలో విక్రయించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, ఏఓ అమరనాథ్‌రెడ్డి, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డెరలను గుర్తించిన సీఎం జగన్

మైదుకూరు : రాష్ట్రంలో వడ్డెర సామాజిక వర్గానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తింపునిచ్చారని రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ ఇడగొట్టు శశికళ, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇడగొట్టు శేషు ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డెరలకు రెండు ఎమ్మెల్సీ స్థానాలను కేటాయించడం హర్షణీయమని వారు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 30 లక్షల మంది వడ్డెరలు వైఎస్సార్‌సీపీకి తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారన్నారు. వైఎస్ జగన్ తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు వడ్డెరలు సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నారు.

పనుల పరిశీలన



టంగుటూరులో వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేయనున్న కోళ్ల ఫారంను పరిశీలిస్తున్న ఆర్డీఓ

రాజుపాళెం : మండల తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆర్డీవో శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. పనుల వివరాలను తహసీల్దార్ ఇందిరారాణిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం టంగుటూరు గ్రామంలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలనే దరఖాస్తు రావడంతో ఆ పొలాన్ని ఆర్డీఓ పరిశీలించారు. ఆ భూమిలో కోళ్ల ఫారం ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటసాయినాథరెడ్డి, ఆర్‌ఐలు సుబ్బారెడ్డి, అశోక్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

చాపాడు : మండలంలోని చిన్నగురువళూరులో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం నాబార్డు సంస్థ వారి సహకారంతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు అందిస్తున్న సేవలను, రుణ సౌకర్యాలు, బీమా సౌకర్యాలు వంటి వాటిపై ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ సభ్యులు మహేష్, రాజేష్ మాటలు, పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ సెబాస్టిన్, ఫీల్డ్ ఆఫీసరు శ్రీకాంత్, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డికి మద్దతుగా ప్రచారం

కలసపాడు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా శుక్రవారం ఆయన సోదరులు ఎగువరామాపురం, లింగారెడ్డిపల్లె, కలసపాడు సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విస్తృత ప్రచారం నిర్వహించి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సచివాలయ వ్యవస్థ ద్వారా 1.30 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించి వారందరికి ప్రొబేషన్ కూడా డిక్లేర్ చేయడం జరిగిందని అన్నారు. పట్టభద్రులంతా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రవీంద్రారెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గురివిరెడ్డి, మండల కన్వీనర్ సుదర్శన్, సచివాలయ కన్వీనర్ శేఖర్, మాజీ ఎంపీపీ సూదా రామకృష్ణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం ఆకస్మిక తనిఖీ



దుకాణంలో ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజ

గోపవరం : మండల పరిధిలోని తుమ్మలపెంట నరసింహులు ఎరువులు, పెస్టిసైడ్ దుకాణాన్ని బద్వేలు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలోని ఎరువుల, పురుగు మందుల స్టాకును పరిశీలించారు. తూకాలు సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించి స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. ధరల పట్టికను క్రమం తప్పకుండా ఏర్పాటు చేయాలని, దుకాణానికి వచ్చిన రైతుల వివరాలను నమోదు చేయాలన్నారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించాలన్నారు. కాలం తీరిన పురుగు మందులను ఎట్టిపరిస్థితుల్లో దుకాణంలో ఉంచవద్దని హెచ్చరించారు. కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు తప్పనిసరిగా అందజేయాలని తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ

ప్రొద్దుటూరు క్రైం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జమ్మలమడుగు డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శాంతికళ తెలిపారు. శుక్రవారం మండలంలోని సోములవారిపల్లె సచివాలయం–1 పరిధిలో సుబ్బారావు కొట్టాలలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కాన్పు కోసం ఎంచుకున్న హాస్పిటల్‌కు మూడు రోజులు ముందుగా చేరాలని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది సలహాలు, సూచనలను పాటించాలని కోరారు. కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబాతో కార్యక్రమం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం డ్రై డే కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. కార్యక్రమంలో 104 డాక్టర్ సుబ్రహ్మణ్యం, సీహెచ్‌ఓ కృష్ణమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, సూపర్‌వైజర్ వరప్రసాద్, ఆరోగ్య సిబ్బంది శిరీష, సుబ్బయ్య, ఉమారాణి, భాగ్యమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

– డిగ్రీ విద్య ఆర్‌జేడీ పి. బాబు



జాతీయ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌జేడీ, అధ్యాపకులు

వైవీయూ : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉన్నతవిద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ పి. బాబు పేర్కొన్నారు. కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో రసాయనశాస్త్రశాఖ, ఐ.సి.ఎ స్.ఎస్.ఆర్ సహకారంతో 'పొల్యూషన్ కంట్రోల్ అండ్ సస్టెయినబుల్ ఎన్విరాన్‌మెంట్' అంశంపై రెండురోజుల జాతీయ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్‌జేడీ మాట్లాడుతూ ప్రపంచం ప్రస్తుతం ఎదుర్కొంటున్న పర్యావరణ కాలుష్య సమస్యకు ఇలాంటి సదస్సులు పరిష్కారం చూపాలని సూచించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యానికి మనందరం బాధ్యులమేనన్నారు. అదే విధంగా కాలుష్యాన్ని తగ్గిస్తూ పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత కూడా మనపై ఉందన్నారు. ముఖ్యవక్తగా విచ్చేసిన తిరుపతి ఐఐటీ కెమిస్ట్రీశాఖ అధ్యాపకులు డాక్టర్ కుమారస్వామిరెడ్డి మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధునాతన విధానాల గురించి వివరించారు. సదస్సు డైరెక్టర్ డా. సి. నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ జాతీయ సదస్సుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 100కుపైగా పరిశోధన పత్రాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో వైవీయూ అధ్యాపకులు ఆచార్య ఎం.వి. శంకర్, డా. టి. చంద్రశేకర్, కళాశాల రసాయనశాస్త్ర విభాగాధిపతి డా. జె. వెంకటలక్ష్మి, డా. మహేష్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



రమాదేవికి రూ. 2 లక్షల చెక్కును అందజేస్తున్న ఏఓ

కడప అర్బన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డుగా విధులను నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మరణించిన వై. శ్రీనివాసులు కుటుంబానికి ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ రూ. 2 లక్షల ఆర్థిక సాయం చేశారు. శుక్రవారం 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంబంధిత చెక్కును అందజేశారు. హోంగార్డు వితరణ నిధి నుంచి ఈ ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ఏఓ జ్యోతి, జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, ఎస్ఈబీ అదనపు ఎస్పీ పూజిత నీలం పాల్గొన్నారు.

వాహనాల స్పెషల్ డ్రైవ్

జిల్లాలో పోలీసులు శుక్రవారం వాహనాల స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన వారిపై 256 కేసులు నమోదు చేశారు. హెల్మెట్ ధరించని వారిపై 247 కేసులు, సీటు బెల్ట్ ధరించకుండా వెళ్తున్న చోదకులపై 9 కేసులు నమోదు చేశారు.

పొలం కబ్జాకు యత్నిస్తున్నారని ఫిర్యాదు

చాపాడు : చాపాడులోని మైదుకూరు–ప్రొద్దుటూరు జాతీయ రహదారి పక్కన సర్వే నంబరు 105లోని 2.83 ఎకరాల తమ పొలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని జమ్మలమడుగుకు చెందిన కరణం శశికళ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. సాగునీటి కొరత వల్ల పొలంలో బోర్లు వేసుకుని పొలం చుట్టూ కంచెరాళ్లను ఏర్పాటు చేసుకున్నామన్నారు. శుక్రవారం పొలం వద్దకు తన భర్త శాంతారాంతో కలిసి రాగా భాస్కర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నీలకంఠారెడ్డి వచ్చి పొలం వారిదని తమను బెదరించి దాడికి ప్రయత్నించారని పేర్కొన్నారు. పొలంలో ఉన్న రెండు బోర్లను ధ్వంసం చేసి, కంచె కోసం వేసుకున్న రాళ్లను పగులగొట్టారన్నారు. ఇదే క్రమంలో తమను చంపుతామని బెదిరించారన్నారు. వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రరెడ్డి తెలిపారు.

28వ తేదీలోగా పంట నమోదు చేయించుకోవాలి

బి.కోడూరు : రబీ సీజన్‌లో పంటలను సాగు చేసిన రైతులు ఈనెల 28వ తేదీలోపు పంట నమోదు చేయించుకోవడంతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి టి.కౌశిక తెలిపారు.అర్హులైన రైతులు ఆయా రైతుభరోసా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ లేక ఉద్యాన సహాయకులను సంప్రదించి పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఉచిత పంటల బీమా, సున్నావడ్డీ, పంట రుణాలు, పెట్టుబడి రాయితీ, మద్దతు ధర, వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే ఈ–క్రాప్, ఈకేవైసీ ప్రామాణికమని, రైతులు త్వరగా పంట నమోదు, ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 95 శాతం ఈకేవైసీ పూర్తయిందన్నారు.

పీహెచ్‌డీలో పల్లవోలు వాసికి గోల్డ్ మెడల్

చాపాడు:చాపాడు మండలం పల్లవోలు గ్రామానికి చెందిన మొగిలి రామయ్య అగ్రికల్చర్ పీహెచ్‌డీలో గోల్డ్ మెడల్ సాధించాడు. న్యూ ఢిల్లీ లోని ఐకార్ ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కాలేజీలో మొగిలి రామయ్య కీటక నాశిని విభాగంలో పీహెచ్‌డీ చేస్తుండగా కాలేజీ 61వ కాన్వకేషన్‌లో డాక్టరేట్‌తో పాటు గోల్డ్ మెడల్ సాధించాడు. దేశ వ్యాప్తంగా కీటక నాశిని విభాగంలో 68 మంది శాస్త్రవేత్తలు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం మరో 8 మందిని ప్రవేశపెడుతుండగా వీరిలో రామయ్య కూడా శాస్త్రవేత్తగా ఎంపికయ్యారు. రామయ్య 6 నుంచి పది వరకూ చాపాడులో హైస్కూల్‌లో చదువుకున్నారు. హైదరాబాదులోని జయశంకర్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ చేశారు. అనంతరం ఢిల్లీ ఐకార్ కాలేజీలో పీహెచ్‌డీ చేశారు. పీహెచ్‌సీడీ సాధించటంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటికే వైద్యసేవలు



పక్షవాతంతో బాధపడుతున్న చంద్రారెడ్డికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కాశినాయన : ఇంటికే వైద్యసేవలు అందిస్తున్నామని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం ప్రాథమిక వైద్యాధికారిణి డాక్టర్ ప్రశాంతి తెలిపారు. శుక్రవారం మండలంలోని నరసాపురం, మిద్దెల గ్రామాల్లో ఇంటింటికీ వెళ్ళి వైద్య సేవలు అందించారు. మిద్దెల గ్రామంలో పక్షవాతంతో బాధపడుతున్న చంద్రారెడ్డికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. మిద్దెల అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. బాలింతలకు రక్తపరీక్షలు చేసి రక్తహీనత ఉన్న వారికి ఐరన్, కాల్షియం మందులను పంపిణీ చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు శ్రీనివాసులరెడ్డి, సుబ్బరాయుడు, ఆరోగ్య పర్యవేక్షకులు బాలయ్య, నాగమణి, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కోరికలను అదుపులో ఉంచుకోవాలి

– బ్రహ్మశ్రీ గరికపాటి నరసింహారావు



మాట్లాడుతున్న బ్రహ్మశ్రీ గరికపాటి నరసింహారావు

ప్రొద్దుటూరు కల్చరల్ : కోరికలను అదుపులో ఉంచుకోవాలని పద్మశ్రీ పురస్కార గ్రహీత బ్రహ్మశ్రీ గరికపాటి నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఉద్యానవనంలో శుక్రవారం ఉమాసహస్రం గ్రంథంపై ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషికి అహంకారం ఉండకూడదని, ఎంత ఎదిగితే అంత ఒదిగి ఉండాలన్నారు. సంకుచిత భావం ఉండకూడదని, బాధలో, ఆపదలో ఉన్న వారికి తగిన సహాయం అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని తెలిపారు. ఉమా సహస్ర గ్రంథంలోని పలు అంశాలను భక్తులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. శని, ఆది వారాల్లో రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటలకు ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం జరుగనుంది. కార్యక్రమంలో ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావు, కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్న శాశ్వత భూహక్కు రైతులకు వరం



మాట్లాడుతున్న తహసీల్దార్ ఇందిరారాణి

రాజుపాళెం : జగనన్న శాశ్వత భూహక్కు రైతులకు ఓ వరం లాంటిదని, గ్రామాల్లో భూ సర్వే ద్వారా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని, ఆ సర్వేను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఇందిరారాణి పేర్కొన్నారు. మండల పరిషత్ సభా భవనంలో శుక్రవారం ఎంపీడీఓ సయ్యదున్నీసా అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం ఇంటింటికి రేషన్ బియ్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మోహన్ మాట్లాడుతూ ట్యాంకుకు నీటిని ఎక్కించి ప్రతి ఇంటికి కొళాయి ద్వారా మంచినీటిని అందిస్తామని, రాబోవు వేసవి కాలంలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కొర్రపాడు పశు వైద్యురాలు లక్ష్మీదేవి మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని రైతులు పశువులు కదల్లేని పరిస్థితిలో ఉన్నప్పుడు 1962 నంబరుకు రైతు ఫోన్ చేస్తే వెంటనే సంచార వాహనం వచ్చి పశువుకు వైద్యం చేస్తారని తెలిపారు. ఏఓ శివరామకృష్ణారెడ్డి , ఐసీడీఎస్ సీడీపీఓ రాజేశ్వరి, ఏపీఓ గంగయ్య మాట్లాడారు. కేసీ కెనాల్ ఏఈ జాన్సన్ మాట్లాడుతూ మార్చి నెలాఖరు వరకు నీటిని అందిస్తామని తెలిపారు. మైలవరం కెనాల్ 12 వేల ఎకరాలు ఆయకట్టు ఉందని, పొలాల్లో మైనర్ కాలువలను కొంతమంది పూడుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శేఖర్, ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్, ఏఓ శివరామకృష్ణారెడ్డి, సూపర్ వైజర్లు లక్ష్మీదేవి, విజయేశ్వరి, ఆర్‌అండ్‌బీ ఏఈ దస్తగిరి, ఎంపీహెచ్ఈఓ శివశంకర్‌రెడ్డి, ఏపీఎం జయరాజ్, ఆయా శాఖల అధికారులు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించండి

కస్తూర్బా బాలికల పాఠశాలలో ఘనంగా ఫేర్‌వెల్ డే వేడుకలు



మాట్లాడుతున్న తహసీల్దారు సుబానీ, పక్కనే ఎంఈఓ రవిశంకర్

చాపాడు : పదో తరగతి, ఇంటర్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల తహసీల్దారు సుబానీ పేర్కొన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం స్పెషల్ ఆఫీసర్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఇంటర్, పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన తహసీల్దారు సుబానీ, మండల విద్యాధికారి రవిశంకర్ మాట్లాడుతూ పేద కుటుంబాల పిల్లలు బాగా చదువుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కస్తూర్బా పాఠశాలలను ఏర్పాటు చేసి అన్ని రకాలైన సౌకర్యాలు, వసతులను కల్పించిందన్నారు. పరీక్షల కోసం ఉపాధ్యాయులు సూచనల మేరకు ప్రణాళికల బద్ధంగా చదువుకోవాలన్నారు. తమ తల్లిదండ్రులు, చదువు చెప్పిన ఉపాధ్యాయులు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు రకాలైన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కస్తూర్బా ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మను'లో 28న నేషనల్ సైన్సు డే



జాతీయ సైన్సుడే పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని మను పాలిటెక్నిక్ ఉర్దూ యూనివర్సిటీలో ఈనెల 28న నేషనల్ సైన్సు డే–2023ను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం కళాశాల ఆవరణలో అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ మాట్లాడుతూ సైన్స్‌డే లో భాగంగా విద్యార్థులు మోడల్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్, కాన్సెప్ట్ వీడియో ప్రెజెంటేషన్ ఇవ్వొచ్చని తెలిపారు. జిల్లాలో ఉన్న స్కూల్స్, ఐటీఐ, డిప్లమోకు సంబంధించిన విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. దీనికి ఎలాంటి రుసుం లేదని తెలిపారు. మరిన్ని వివరాలకు 9398083058 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ హకీముద్దీన్ అహ్మద్, విలయత్ అలీబైగ్, డాక్టర్ సోయబ్, నసార్ అయూబ్, ఖాజామొయినుద్దీన్, సికిందర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పావని బెహన్‌జీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మోడంపల్లె సినీహబ్ సమీపంలోని ఓంశాంతి భవన్‌లో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల సెట్టింగ్‌లను దర్శించాలని మోక్షగుండం ఓం శాంతి భవన నిర్వాహకురాలు బీకే పావని బెహన్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో జ్యోతిర్లింగాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించేందుకు మోక్షగుండం వీధిలోని ఓం శాంతి భవన్ ఆధ్వర్యంలో శనివారం నుంచి మంగళవారం వరకు ద్వాదశ జ్యోతిర్లింగాల సెట్టింట్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటలకు ప్రముఖుల చేతుల మీదుగా ద్వాదశ జ్యోతిర్లింగాల సెట్టింగ్ ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. అలాగే రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు నటరాజ కళాక్షేత్రం నాట్యగురువు నాట్యవిశారద మోహిద్దీన్ ఖాన్ ఆధ్వర్యంలో నృత్యప్రదర్శన ఉంటుందన్నారు. రోజూ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శించు కోవచ్చని, ఉచిత ప్రవేశ మని భక్తులు పాల్గొని జ్యోతిర్లింగాల దర్శనం చేసుకుని శివ పరమాత్ముని అనుగ్రహం పొందాలని కోరారు. ఓం శాంతీలు మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంఘాల బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్



డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్‌ను సన్మానిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

బద్వేలు అర్బన్ : ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఏరియా కో ఆర్డినేటర్లు, ఏపీఎంలు పనిచేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌నాయక్ తెలిపారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో బద్వేలు, గోపవరం మండలాల వెలుగు సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంఘాల పనితీరును పరిగణనలోకి తీసుకుని కొత్తగా గ్రేడింగ్ ఇచ్చే విధానానికి శ్రీకారం చుట్టిందని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి మంచి గ్రేడింగ్ సాధించాలని కోరారు. అలాగే పొదుపు సంఘాల సమావేశాల నిర్వహణ, అప్పుల వసూలు, రుణాల చెల్లింపు వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. అలాగే వెనుకంజలో ఉన్న సంఘాలను చైతన్యపరిచి బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండలాల వారీగా స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. తొలుత నూతనంగా బాధ్యతలు చేపట్టి తొలిసారి బద్వేలుకు విచ్చేసిన పీడీని మహిళా సమాఖ్య సభ్యులు సన్మానించారు. సమావేశంలో వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ బి.వెంకటసుబ్బారెడ్డి, ఆయా మండలాల ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

